
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
సోమవారం
16 మార్చి 2026
పేజీలు : 8
Follow :

## నాలుగేళ్లుగా అందని
# కొత్త పింఛన్లు
### వృద్ధులు, వితంతువుల ఆవేదన

**నల్గొండ జిల్లాలో కొత్త పింఛన్ల మంజూరు కాక దరఖాస్తుదారుల ఆవేదన**

**దరఖాస్తులకే పరిమితమైన పింఛన్ల మంజూరు**

**పింఛన్ల మంజూరుకు దరఖాస్తుదారుల డిమాండ్**




**చండూరు, మార్చి 15 (జనంసాక్షి):** నెలవారీగా ప్రభుత్వం చెల్లించే పింఛన్లపై ఆధారపడి జీవిస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకు కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. నల్గొండ జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వేలాది మంది దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎదురుచూపులతో కాలం గడుపుతున్నారు. వృద్ధాప్యంలో పని చేయలేని వృద్ధులు పింఛన్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కుటుంబ పరిస్థితులు బలహీనంగా ఉండటంతో పింఛన్లు వస్తేనే వారి రోజువారీ అవసరాలు తీర్చుకోవచ్చని పలువురు వృద్ధులు చెబుతున్నారు. పింఛన్లు లేకపోతే ఆర్థిక ఇబ్బందులు మరింతగా పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితరులు చేయూత పథకం కింద పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే గత నాలుగేళ్లుగా కొత్తగా ఒక్క పింఛను కూడా మంజూరు కాకపోవడంతో దరఖాస్తులు పెండింగ్లోనే ఉన్నాయి. ఫలితంగా దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నిరాశకు గురవుతున్నారు. గతంలో ప్రభుత్వం 2022 ఆగస్టులో 57 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారికి ఆసరా పింఛన్లు మంజూరు చేసింది. ఆ తర్వాత నుండి కొత్తగా ఒక్క పింఛను కూడా మంజూరు కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎవరైనా పింఛన్ పొందుతున్న వారు మరణిస్తే వారి పింఛన్‌ను నిలిపివేస్తున్నారు గానీ కొత్త వారికి మంజూరు చేయడం లేదని అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పింఛన్లకు సంబంధించి సుమారు 20 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఎక్కువగా వృద్ధాప్య మరియు వితంతు పింఛన్ల దరఖాస్తులే ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 53,205 మంది వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారు. దివ్యాంగుల పింఛన్లు 56,277 మంది, వితంతు పింఛన్లు కూడా 56,277 మంది పొందుతున్నారు. ఒంటరి మహిళల పింఛన్లు 6,795 మంది పొందుతుండగా, చేనేత కార్మికులు 873 మంది, కల్లుగీత కార్మికులు 6,552 మంది, ఎయిడ్స్ బాధితులు 1,205 మంది, ఫైలేరియా బాధితులు 2,109 మంది, డయాలసిస్ పింఛన్లు 258 మంది పొందుతున్నారు. ఇంకా వేలాది మంది పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో ప్రభుత్వం పింఛన్లను పెంచుతామని హామీ ఇచ్చిందని ప్రజలు గుర్తు చేస్తున్నారు. చేయూత పథకం కింద వృద్ధాప్య, వితంతు మరియు ఇతర పింఛన్లను రూ.4,000 వరకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6,000 వరకు పెంచుతామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శలు వస్తున్నాయి. ఇతర సంక్షేమ పథకాలైన మహాలక్ష్మి పథకం, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై మాత్రం స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయం అని దరఖాస్తుదారులు అంటున్నారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా 73 మండలాలు, 19 మున్సిపాలిటీలలో వేల సంఖ్యలో పింఛన్ దరఖాస్తులు పెండింగ్లో ఉండటంతో ప్రభుత్వం త్వరగా స్పందించి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుని అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

**ఎంపీ చామలకి వినతిపత్రం అందజేసిన తెలంగాణా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా**

**భువనగిరి, మార్చి 15 (జనంసాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పలు సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు . ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని అని అడిగిన విషయాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు . జర్నలిస్టులకు ప్రజా పాలన ప్రభుత్వం మీకు పూర్తిగా అండగా ఉంటుందని అన్నారు .



## ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**చింతపల్లి, మార్చి 15(జనంసాక్షి)** ప్రభుత్వం పేదల గృహ కలను సాకారం చేయాలనే లక్ష్యంతో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ద్వారా పేద ప్రజలకు సొంత ఇల్లు కల సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, మాజీ సర్పంచ్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, చింతపల్లి గ్రామ సర్పంచ్ కాసారపు శ్వేత శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎండి సిద్దిక్ బాబా, ఎలిమినేటి నరసింహ,గోవిందు రవి, గోవింద్ జ్ఞానేశ్, అధికారులు, గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.




## మాడుగులపల్లిలో యూరియా దందా

# అన్నదాతపై అదనపు భారం!

**ప్రభుత్వ ధరలు కాగితాలకే పరిమితం అధికారుల యంత్రాల సాక్షిగా అక్రమ వసూళ్లు**

**మాడుగులపల్లి, మార్చి 15 (జనంసాక్షి ):** జిల్లాలోని మాడుగులపల్లి మండలంలో ఎరువుల వ్యాపారుల ఆగడాలు మిన్నంటుతున్నాయి. సాగు పనుల్లో నిమగ్నమైన రైతులకు అండగా ఉండాల్సిన ఫెర్టిలైజర్ షాపుల యజమానులు, వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూరియా విక్రయాలు జరగాల్సి ఉన్నా, క్షేత్ర స్థాయిలో మాత్రం నల్లబజారు దందా జోరుగా సాగుతోంది.




**ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నా అదనపు బాదుడే!**

ప్రభుత్వం పారదర్శకత కోసం ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించినా, మాడుగులపల్లి మండలంలోని పలు దుకాణాల్లో ఇది అలంకారప్రాయంగానే మారింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రైతులకు సైతం స్టాక్ లేదని సాకులు చెబుతూ, తెరవెనుక అధిక ధరలకు బేరాలు కుదుర్చుకుంటున్నారని సమాచారం. ఒక్కో యూరియా బస్తాపై ప్రభుత్వం నిర్ణయించినఎమ్మార్పీ ధర కంటే రూ. 50 నుండి రూ. 100 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు కేవలం అధిక ధర వసూలు చేయడమే కాకుండా, రైతులపై మరో భారాన్ని కూడా మోపుతున్నారు. యూరియా బస్తా కావాలంటే దానితో పాటు నానో యూరియా బాటిల్ లేదా ఇతర పనికిరాని జింక్, సల్ఫర్ ప్యాకెట్లు ఖచ్చితంగా కొనాలి అంటూ కండిషన్లు పెడుతున్నారు. దీనివల్ల రైతుకు అదనంగా మరో రూ. 200 నుండి రూ. 400 వరకు అనవసరపు ఖర్చు అవుతోంది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనే అని రైతాంగం మండిపడుతోంది.

**మాడుగులపల్లిలో పర్యవేక్షణ ఏది?**

మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ఫెర్టిలైజర్ షాపులపై వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైందని విమర్శలు వస్తున్నాయి. రశీదుల మాయాజాలం పోస్ మెషిన్లలో ఒక ధర చూపిస్తూ, బయట మరో ధర వసూలు చేస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు కనిపిస్తున్నా, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికారుల మౌనం వెనుక మతలబు ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. నల్గొండ జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మాడుగులపల్లి మండలంలో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టాలి. అధిక ధరలకు విక్రయిస్తున్న షాపుల లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతు గోస మేము ఆన్‌లైన్‌లో చూస్తే స్టాక్ చూపిస్తుంది, కానీ షాపుకి వెళ్తే లేదంటున్నారు. ఎక్కువ పైసలు ఇస్తామంటే మాత్రం లోపల నుండి తీసిస్తున్నారు. మమ్మల్ని ఆదుకోవాల్సిన అధికారులే పట్టించుకోకపోతే ఎవరికి చెప్పుకోవాలి.

## బహుజన స్వరాజ్య సిద్ధాంతకర్త కాన్షీరామ్

**నేరేడుచర్ల (జనంసాక్షి ):** బహుజన స్వరాజ సిద్ధర్థ కర్త కాన్షీరాంనీ 92 వ జయంతి సందర్భంగా నేరేడుచర్లలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు హుజూర్ నగర్, నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు కంటెస్టెడ్ ఎమ్మెల్యే రాపోలు నవీన్ మాట్లాడుతూ,ఈ దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలు 92 శాతం ఉండగా కేవలం ఎనిమిది శాతం మాత్రమే జనాభా కలిగిన అగ్రవర్ణాల అధికార అధిపత్యాన్ని ప్రశ్నించిన సామాజిక విప్లవ వీరుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని వారు కొనియాడారు. మన దేశంలో రాజ్యాధికారం సాధించాలంటే అట్టడుగు వర్గాల వారిని ఐక్యం చేసి రాజకీయ పోరాటం చేయడం ద్వారానే అధికారం సిద్ధిస్తుంది నమ్మి ఆ వైపు ప్రయాణం సాగించి విజయం సాధించిన ధీరుడు కాన్షీరాం అని. ఈ తరుణంలోనే ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ జరగాలన్న బీసీల్లో జనగణనలో కులగణ సాధించాలన్నా చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్ సాధించాలన్నా ఇదే సరైన సమయం అని అందువల్ల బీసీ ఎస్సీ ఎస్టీలు ఐక్య ఉద్యమాలు నిర్మించి రాజ్యాధికారం సాధించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తక్కెళ్ళ నాగార్జున పాల్గొన్నారు.



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

**సూర్యాపేట(జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని విద్యానగర్ రామలింగేశ్వర స్వామి టెంపుల్ రోడ్డులో గల ఐరీస్ ఒలంపియాడ్ స్కూల్ లో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. డీఈఓగా లక్ష్మిప్రణీత, ఎంఈఓగా జోషితారెడ్డి, హెచ్ఎంగా వర్షిత్ తోపాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మన్నె మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, బాధ్యతను పెంపొందించ దానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా, ప్రిన్సిపాల్ గా వ్యవహరిస్తూ పాఠశాల నిర్వహణను చేపట్టడంతో వారిలో ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సృజనారెడ్డి, జ్యోతి, భవాని, నవ్య, రాధిక, ఉదయశ్రీ, ఆస్మా, వర్షిణీ, సట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత


**మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

**సూర్యాపేట(జనంసాక్షి):** పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులకు వైద్యులు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజు కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో వారి సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. వారి ఆరోగ్యం కాపాడటం కూడా మున్సిపాలిటీ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. రోజువారీ పనుల్లో భద్రతా, ఆరోగ్య నియమాలను పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్మికుల సంక్షేమం కోసం మున్సిపాలిటీ తరపున మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. హన్మంతరెడ్డి, వైస్ ఛైర్మెన్ ఎండి. షఫీ ఉల్లా, కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డి, శానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్, వైద్య అధికారులు, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు షబ్ - ఏ - ఖదర్

**దేవరకొండ, మార్చి 15 (జనంసాక్షి)** రంజాన్ మాసం లో పవిత్ర ఖురాన్ పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగే షబ్ ఏ ఖదర్ సోమవారం దేవరకొండ పట్టణంలోని స్థానిక మక్కా మస్జీద్ లో జరుపనున్నట్లు ఈద్గా, మక్కా మస్జీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్ పేర్కొన్నారు. షబ్ ఏ ఖదర్ ( జగ్నె కి రాత్ ) సందర్భంగా ముస్లిం సోదరులు జాగారం నిర్వహిస్తారన్నారు. ఈ రాత్రి అత్యంత పవిత్ర మైన రాత్రి గా పరిగణమిస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక మక్కా మస్జీద్ లో రాత్రి పది గంటలకు ప్రత్యేక నమాజ్ ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా గద్వాల్ ప్రాంతం నుండి జనాబ్ మహ్మద్ ఖలిలుల్లాహ్ సహాబ్ విచ్చేస్తున్నారని వీరి ప్రత్యేక ఉపన్యాసం ఉంటుందన్నారు. అనంతరం మస్జీద్ లో సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో గౌరవ అధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి యండి ఇలియాస్ పటేల్, అబ్దుల్ ఖదీర్, యండి ఖుద్రతుల్లా, ఖాజా మైనోద్దీన్, షబ్బీర్, సయ్యద్ దస్తగిర్, యండి సలీమ్, ఎండి షకీల్, ఎస్ కె బురాన్, యండి ముజీబ్, మహ్మద్ అఫ్రోజ్, జాఫర్ ఖాన్, ఇల్యాస్ బాబా, యండి ఖైసర్, షఫీ ఉల్లా, ఇస్మాయిల్ అజ్మత్, జాకిర్, తదితరులు ఉన్నారు



# అంబరాన్నంటిన స్మార్ట్ కిడ్జ్ పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించిన నగర మేయర్ పూనకొల్లు నీరజ, కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య, డైరెక్టర్ సుకన్య
- కనువిందు చేసిన చిరు మువ్వల సందడి




**ఖమ్మం, మార్చి 15, (జనంసాక్షి) :**
స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే సంబురాలు అంబరాన్నంటాయి. డిజిటల్ లైట్ల వెలుగుల్లో అతిపెద్ద వేదికపై చిన్నారులకు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పట్టాలు అందుకున్న చిన్నారులు మురిసిపోయారు. చిరుమువ్వల సందడితో నృత్యాలు చేస్తూ అతిథులను, తల్లిదండ్రులకు చిన్నారులు స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చింత నిప్పు కృష్ణ చైతన్య పర్యవేక్షణలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు నగర మేయర్ పూనకొల్లు నీరజ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ ఈ పాఠశాలలోని చిన్నారులు ఒత్తిడి లేని చదువులతో స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ గ్రాడ్యుయేషన్ డే పట్టాలు అందుకోవడం హర్షనీయంఅన్నారు. చిన్నారులు స్టేజి పైకి ధైర్యంగా వచ్చి మురిసిపోతూ గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకోవడమే కాకుండా హుషారుగా నృత్యాలు ప్రదర్శించడం ముచ్చటేస్తుందని తెలిపారు. చిన్నారుల నుంచి మొదలుకొని ఐదవ తరగతి విద్యార్థుల వరకు ప్రాథమిక విద్యను అందించడంలో ఖమ్మం నగరంలో తిరుగులేని విద్యాసంస్థగా స్మార్ట్ కిడ్జ్ పాఠశాల విద్యా సేవలు అందించడం గర్వించదగిన విషయం అన్నారు. విద్యార్థులను ఆల్ రౌండర్‌లు గా తీర్చి దిద్దుతున్న స్మార్ట్ కిడ్జ్ పాఠశాలకు తల్లిదండ్రులు ఎల్లప్పుడూ తమ సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధతో విద్యను అందించడం వలన గత 14 సంవత్సరాలుగా తల్లిదండ్రులు తమ పాఠశాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ డే అనేది చిన్నారులలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోవాలనే ఉద్దేశంతో ఈ వేడుకను గ్రాండ్ గా నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య మాట్లాడుతూ చిన్నారులపై ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని చిన్నారుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రత్యేక విద్యా విధానం ద్వారా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డి ఎం అండ్ హెచ్ ఓ కళావతి భాయి ,స్థానిక కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు . సభలో గ్రాండ్ పేరెంట్స్, పేరెంట్స్ వేదికపై తమ చిన్నారులకు స్మార్ట్ కిడ్జ్ పాఠశాల అందిస్తున్న ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్యను నేర్పుతున్న విధానాన్ని ప్రశంసించారు. అనంతరం చిన్నారు లకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించారు. డిజిటల్ లైట్ల వెలుగుల్లో గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న చిన్నారులు పలు రకాల సంస్కృతిక కార్యక్రమాలలో కనువిందు చేశారు. సాంప్రదాయ, జానపద, సినిమా పాటలకు స్టెప్పు లేస్తూ కేరింతలు కొడుతూ వేదికపై సందడి చేశారు. తమ చిన్నారులు గ్రాండ్ గా వేదికపై గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకోవడం నృత్యాలతో అలరించడంతో తల్లిదండ్రులు మురిసిపోయారు.



# ఏఎస్ఐ ప్రమోషన్ తో బదిలీపై వెళ్తున్న పెంటయ్యకు ఘన సన్మానం

**పెనుబల్లి, మార్చ్15(జనంసాక్షి)**
పెనుబల్లి మండలం వి ఎం బంజర్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేసి ఎ ఎస్ఐ గా పదోన్నతి తొ కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ కి బదిలీ పై వెళుతున్న సి హెచ్ పెంటయ్య కు ఆదివారం స్టేషన్లో శాలువాతో ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో సిఐ ముత్తు లింగయ్య, ఎస్ ఐ కె వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు సూర్యాపేటలో హోటల్స్ బంద్

### బంద్ కు పట్టణ ప్రజలు సహకరించాలి



**సూర్యాపేట( జనంసాక్షి):**
సూర్యాపేట పట్టణంలోని అన్ని రకాల హోటల్స్ , మిర్చి బండ్లు, ఇడ్లి బండ్లు, టీ స్టాల్స్, కర్రి పాయింట్లు, బేకరీలు, బిర్యాని సెంటర్స్ నేడు జరిగే బంద్ లో పాల్గొంటున్నాయని సూర్యాపేట పట్టణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పానుగంటి శ్రీనివాస్, పెట్టి వెండర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు బిల్లకంటి జానకిరాం బ్లూసి జానీ తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తమకు సరిపడా కమర్షియల్ గ్యాస్ దొరకడం లేదని, తాము హోటల్స్ నడపలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.సూర్యాపేట పట్టణంలోని దాదాపు 150 హోటల్స్ లలో 1500మంది పని చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో వారికి ఉపాధి పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తమకు కమర్షియల్ గ్యాస్ సప్లై చేయాలని, హోటల్స్ పై దాడులు నిలిపివేయాలని అన్నారు. నేడు జరిగే బంద్ కి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో హోటల్ యజమానులు మేడి పవన్, విశాల్, రమేష్, మొరిశెట్టి రాము, బొక్క శ్రీనివాస్, హరిప్రసాద్, ప్రవీణ్, రజనీకాంత్ , గాలి ప్రభాకర్, టి.నరేష్, బత్తుల చిన్ని, రవ్వ సాంబయ్య, ఆదిత్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి కార్మికుల కృషిపై ఆధారపడి ఉంటుంది

### సర్పంచ్ నక్క చంద్ర శేఖర్

**నాంపల్లి,మార్చి,15(జనంసాక్షి)**
మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గ్రామ సర్పంచి నక్క చంద్రశేఖర్ శానిటేషన్ కిట్లు పంపిణీ చేసి శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి సేవలను అభినందించారు.గ్రామాభివృద్ధి పారిశుధ్య కార్మికుల కృషి పై ఆధారపడి ఉంటుందని అన్నారు. కార్మికులు ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి సేవలు గ్రామానికి ఎంతో అవసరమని తెలిపారు.మన సొంత ఇంటిని ఎలాగైతే శుభ్రంగా ఉంచుకుంటామో,మన గ్రామాన్ని కూడా అలాగే శుభ్రంగా ఉంచాలి అని కార్మికులకి సూచిస్తూ, గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు



# హిందు ధర్మాన్ని అవమానించడం ఎమ్మెల్యే మందుల సామేల్‌కు తగదు

### ఎమ్మెల్యే తక్షణమే హిందువులకు క్షమాపణ చెప్పాలి

### తుంగతుర్తి సర్పంచ్, మల్లె పాక సాయి బాబా

**తుంగతుర్తి మార్చ్ 15 (జనంసాక్షి)**



ఇటీవల హైదరాబాదులోని గాంధీ భవన్ లో జరిగిన ఒక కార్యక్రమంలో తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామేల్ హిందూ ధర్మానికి అవమానం కలిగే విధంగా మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడే బ్రాహ్మణుల పట్ల అసభ్యంగా మాట్లాడడం ఎంత మాత్రం తగదని తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు అన్నారు . ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ శాసన సభ్యుడు హిందూ మతం కానందున హిందూ ధర్మాన్ని అగౌరవ పరిచే మాటలు మాట్లాడటం ఇది కాంగ్రెస్ పార్టీ విధానమా, లేక సామేల్ విధానమా అని ప్రశ్నించారు ఎవరికి నచ్చిన మతం వాళ్ళు ఆచరించవచ్చుఅని, కాని పరాయి మతాన్ని కించపరచడం తగదు అని అన్నారు ఎమ్మెల్యే వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు వేదికల మీద విషయ పరిజ్ఞానం లేకుండా ఏది పడితే అది మాట్లాడితే నవ్వుల పాలు కావాల్సి వస్తుందని అన్నారు.

# శానిటేషన్ సిబ్బందికి హెల్త్ క్యాంపు

**నేరేడుచర్ల (జనంసాక్షి)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయం నందు శానిటేషన్ సిబ్బందికి హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, బస్తీ దవాఖాన డాక్టర్ సాయి రామ్, కౌన్సిలర్స్ ఇంజమురి శ్రీకాంత్, అబ్దుల్ ఖలీమ్ , బోలిశెట్టి లక్ష్మయ్య,మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ళ సురేష్ రెడ్డి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు,మెప్మా ఆర్పిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# సాయి నాథుని దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయ మూర్తి

**చింతపల్లి, మార్చి 15(జనంసాక్షి)**
చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సన్నిధిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి ఆలయ అర్చకులు వేదా ఆశీర్వచనము అందిచారు. ఆయన మాట్లాడుతూ సాయి నాథుని దర్శించుకోవడం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని అన్నారు.. ఈ కార్యక్రమం లో దేవరకొండ న్యాయమూర్తి అనిత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదగాని నాగేశ్వరరావు, శనగల యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.శరత్ మాక్సి లేజర్ కంటి ఆసుపత్రి వరంగల్ వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు,ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు,అర్హులైన రేషన్ కార్డు కలిగిన వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మాడుగులపల్లిలో ఘనంగా గ్రామ సేవకుల సత్కారం

❑ ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా వైద్య పరీక్షలు

❑ కార్మికుల సేవలు అభినందనీయం గ్రామ ప్రజాప్రతినిధులు

**మాడుగులపల్లి, మార్చి15( జనంసాక్షి):** గ్రామ అభివృద్ధిలో అనునిత్యం వెన్నంటి ఉండి శ్రమిస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ల సేవలు వెలకట్టలేనివని మాడుగులపల్లి గ్రామ ప్రజాప్రతినిధులు కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక లో భాగంగా, మాడుగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్లకు ఆదివారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగుల పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్కర్లకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ వంటి ఇతర సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు, తమ ఆరోగ్యం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.



**ఘనంగా సన్మానం**

వైద్య పరీక్షల అనంతరం, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లను స్థానిక సర్పంచ్ నరేష్, ఉప సర్పంచ్ మల్లేపల్లి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి కాశీంలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. నిరంతరం కష్టపడే వర్కర్లకు అండగా ఉండటం వారిని గౌరవించుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సూపర్వైజర్ సభిస్టిన్, మణి,స్లీవా, ఆశ వర్కర్స్ జ్యోతి, పుష్ప మల్టీపర్పస్ వర్కర్స్ దర్శనం లక్ష్మయ్య, పుల్లెంల గురవమ్మ, వెంకన్న, సైదులు, కృష్ణ, దస్తగిరి, నాగమ్మ తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మహిళా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

## రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి




**రామన్నపేట, మార్చి 15 (జనంసాక్షి):** రామన్నపేటలో మార్చి 31న జరగనున్న మహిళా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో రాష్ట్ర సదస్సు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని విదేశీ స్వదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని అందులో భాగంగానే విత్తన బిల్లు, మార్కెట్ ముసాయిదా బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు తీసుకొచ్చారని గతంలో రైతంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఉన్న అవకాశాలను కూడా దూరం చేస్తున్నారన్నారు. నాట్లు వేసినప్పుడే ఇవ్వాల్సిన రైతు భరోసాను పంట కోసే వరకు కూడా రావడం లేదని వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు భూమిపై ఎలాంటి హక్కులు లేకుండా జాయింట్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు పాలకులు వాగ్దానాలు చేస్తున్నారు తప్ప ఆచరణలో అమలు కావడం లేదు, మరోవైపు పెట్టుబడి సహాయం అందకపోవడంతో మహిళా రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కౌలు రైతుల్లో కూడా మహిళలు గణనీయంగా ఉన్నారని పాలు, పండ్లు, కూరగాయలు, చేపల పెంపకం,కోళ్ల పెంపకంలో వీరి పాత్ర కీలకంగా మారిందని వీటిలో కూడా మహిళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బోయిని ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జల్లెల పెంటయ్య,బల్గూరి అంజయ్య సిఐటియు జిల్లా నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, వేముల సైదులు , భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో పాల్గొన్న వైద్య సిబ్బందికి పారితోషికం పంపిణీ

**హాలియా, మార్చి 14 జనంసాక్షి:** హాలియా పట్టణ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించిన పారామెడికల్ వైద్య సిబ్బందికి నేడు పారితోషికం అందజేశారు. ఈ పారితోషికం ఇవ్వకుండా నిలిపివేయడంతో నల్లగొండ జిల్లా ఐఎన్టీయూసీ 3194 సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. విషయంపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ అన్ని పట్టణాల కమిషనర్లకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు హాలియా పట్టణ కమిషనర్ స్పందించి పట్టణ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించిన వైద్య సిబ్బందికి



పారితోషికం పంపిణీ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసిన సంఘం ప్రతినిధులకు వైద్య సిబ్బంది ధన్యవాదాలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

# సామాజిక అధికారమే కాన్షీరామ్ లక్ష్యం

## ప్రొఫెసర్ సోమనబోయిన సింహాద్రి

## కక్కిరేణిలో కాన్షీ రామ్ జయంతి వేడుకలు

**రామన్నపేట, మార్చి 15 (జనంసాక్షి):** మండలంలోని కక్కిరేణి గ్రామంలో బహుజన సామాజిక విప్లవ కారుడు కాన్షీరామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సోమనబోయిన సింహాద్రి మాట్లాడుతూ కాన్షీరామ్ బహుజన సమాజ్ పార్టీనీ స్థాపించి బహుజనులకు అధికారాన్ని అందించి, రాజ్యాధికార సాధనలో సమాజ్ వాది పార్టీ నాయకులైన మూలాయం సింగ్ యాదవ్ తో కలిసి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, 1993 లో అధికారాన్ని చేపట్టడంతో సామాజిక విప్లవానికి నాంది పలికారు. ఇది దేశ చరిత్రలోనే ఊహించని పరిణామం సాంప్రదాయక రాజకీయ శక్తులకు వణుకు పుట్టించిన విధంగా ముందుకు సాగింది. పార్లమెంట్ పద్ధతిలో పేద, దళిత, మైనారిటీ, వెనుకబడిన తరగతులను అధికారం వైపు నడిపించవచ్చునని రుజువు చేశారని, ఈనాటి సామాజిక ఉద్యమకారులకు వారి ఉద్యమం ఆదర్శంగా నిలిచింది. పూలే, అంబేద్కర్ , కాన్షీరామ్ మండల్ భావజాలంతో సామాజిక మార్పు సాధ్యమేనని తేలిపోయింది. కుల గణన , రాజ్యాంగ పరిరక్షణ, హక్కుల పరిరక్షణ, సామాజిక, ఆర్థిక న్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయినప్పుడే భారత రాజకీయాలలో కుల విముక్తి సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం గ్రామ పెద్దలు కలిసి ప్రొఫెసర్ సింహాద్రి ని శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేముల సైదులు, నూకల యాదయ్య , సోమనబోయిన ఆదినారాయణ , భాషకార్ల నరేందర్ రెడ్డి , శిగ రాజు గౌడ్, కన్నెబోయిన యాదయ్య , మల్లేష్ , నరసింహ , అంకిరెడ్డి యాదయ్య ముదిరాజ్, నల్ల ప్రసాద్, యాదయ్య , స్వామి , చిర్రబోయిన సత్యనారాయణ, వెలిజాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# కస్తాల 'ఎక్స్' రోడ్లో ఉద్రిక్తత.. పోలీసుల వైఫల్యంపై స్థానికుల ఆగ్రహం




**చండూరు, మార్చి 15 (జనంసాక్షి)** నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలో శాంతిభద్రతలు ఒక్కసారిగా క్షీణించాయి. కస్తాల క్రాస్ రోడ్ వద్ద ఆదివారం సాయంత్రం రెండు వర్గాల యువకుల మధ్య మొదలైన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గంటల తరబడి ఘర్షణ కొనసాగుతున్నా.. పోలీసులు రంగ ప్రవేశం చేయకపోవడంపై మున్సిపల్ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. కస్తాల క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఒక కూడలిలో యువకుల మధ్య చిన్నపాటి మాటపట్టింపు మొదలైంది. ఇది కాస్తా ముదిరి పరస్పర దాడులకు దారితీసింది. యువకులు గుంపులుగా విడిపోయి బహిరంగంగానే ఘర్షణకు దిగడంతో ఆ ప్రాంతం అంతా రణరంగంగా మారింది. ఈ గొడవ వల్ల చుట్టుపక్కల దుకాణదారులు భయభ్రాంతులకు గురయ్యారు. రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఘర్షణ మొదలై గంట సమయం గడిచినా, సంబంధిత పోలీసు అధికారులు పరిస్థితిని అదుపులోకి తీసుకు రావడంలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే కస్తాల రోడ్డులో గంట సేపు గొడవ జరుగుతున్నా... పోలీసుల స్పందన కరువైందని ప్రజలు వాపోతున్నారు.

**శాంతిభద్రతల ప్రశ్నార్థకం:**

మన వ్యవస్థ ఎటు వెళ్తోంది? అని మున్సిపల్ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గొడవలు జరుగుతుంటే నివారించాల్సిన బాధ్యత ఉన్న పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. చండూరు పట్టణంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో పోలీసు పెట్రోలింగ్‌ను పెంచి, ప్రజల భద్రతకు హామీ ఇవ్వాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

# మాజీ జడ్పీ ఛైర్మన్ గోనెల విజయలక్ష్మికి నివాళులు



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ మహిళా జిల్లా నాయకురాలు శ్రీ"గోనెల విజయలక్ష్మి దశదిన కర్మ భద్రాద్రి కొత్త గూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలగూడెంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంబాని చంద్రశేఖర్, ఇల్లందు ఏంఎల్ఏ కోరం కనకయ్య, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, పసుపులేటి దేవేందర్ , రంగిశెట్టి కోటేశ్వర రావు, పసుపులేటి నాసరయ్య,యాస రామారావు, చింతలపూడి వెంకన్న, చింతలపూడి శేఖర్, పసుపులేటి లక్ష్మీ, దాసరి బాలకృష్ణ తదితరులు పాల్గొని జిల్లా పరిషత్ తను చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కూతురు ఆకుల కరుణ, అల్లుడు రవి, వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి సానుభూతి తెలిపారు.



## మిషన్ భగీరథ నీరు వృధా

**వలిగొండ, మార్చి 15 (జనంసాక్షి)** మండలంలోని వెల్వర్తి గ్రామం పరిధిలో మిషన్ భగీరథ పైప్ నుంచి భగీరథ నీరు పారుతూ పోతుంది. అసలే వేసవి కాలం కావున త్వరగా వీటికి సంబంధించిన అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కొమరం లక్ష్మణరావు కు గౌరవ డాక్టరేట్

## ఆదివాసీ బిడ్డకు దక్కిన అరుదైన గౌరవం



**మణుగూరు, మార్చి15 (జనంసాక్షి):** మణుగూరు మండల వ్యవసాయ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణరావు ను గౌరవ డాక్టరేట్ వరించింది. తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం.వీరయ్య ఆదివారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వానికి, నీతి అయోగ్ అనుబంధంగా గౌరవ డాక్టరేట్ ను కొమరం లక్ష్మణరావు అందుకున్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడుస్తున్న మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్, మినిస్ట్రీ ఆఫ్ ఎం ఎస్ ఎం ఈ ఆధ్వర్యంలో లక్ష్మణరావు చేసిన సేవలకు గుర్తించి డాక్టరేట్ అందజేశారు ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న అఖిల భారతీయ ఆదివాసి వికాస్ పరిషత్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా సేవలను అందిస్తున్న సందర్భంగా ఈ గౌరవం దక్కింది. ఈ పరిషత్ లో కేంద్ర మంత్రులు, ఎంపీలు వివిధ రాష్ట్రాల కు చెందిన ప్రముఖులు పని చేస్తూ ఉంటారు వ్యవసాయ విస్తరణ అధికారిగా పలు మండలా లలో ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూనే సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురు మన్ననలు పొందారు. ఆపదలో ఉన్నవారికి ఆదుకుంటూ తోచిన ఆర్థిక సహాయాన్ని అందజేయడం కారణం గానే గౌరవ డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ... చాలా సంతోషంగా ఉందని తెలిపారు నేను చేసిన ఈ సేవలకు మిత్రులు, పాత్రికేయులు ఎంతో సహకారం అందించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఖమ్మంలో కాన్షిరాం జయంతి సందర్భంగా బీఎస్పీ బైక్ ర్యాలీ



**ఖమ్మం, మార్చి 15,(జనంసాక్షి) :** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్య శ్రీ కాన్షిరాం గారి 92వ జయంతి సందర్భంగా ఖమ్మం పట్టణంలో బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెవిలియన్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మయూరి సెంటర్, పాత బస్టాండ్, జడ్పీ సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్, ఖమ్మం కోర్టు, మమత హాస్పిటల్ రోడ్ మీదుగా అంబేద్కర్ భవన్ వరకు కొనసాగింది. అనంతరం అంబేద్కర్ భవన్‌లో కాన్షిరాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయాధికారాన్ని పరిచయం చేసిన మహనీయ నాయకుడు కాన్షిరాం అని అన్నారు. దేశంలో బహుజనుల సమస్యల పరిష్కారానికి బహెన్ కుమారి మాయావతి నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుర్ర ఉపేంద్ర సాహూ, ఎం. పుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, మట్టే నాగేశ్వరరావు, పి. రాజశేఖర్, దారెల్లి రమేష్, బి. ఉపేందర్, కారుమంచి నాగరాజు, నల్లగట్టు సతీష్, ఆధురి కోటయ్య, రమేష్ యాదవ్, రామకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల మన్ననలను పొందాలి

## సూర్యాపేటలో మినిస్టర్ వైట్ షోరూం ప్రారంభం





**సూర్యాపేట (జనంసాక్షి):** వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించి వారి మన్ననలను పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే సర్వీస్ రోడ్ సిఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినిస్టర్ వైట్ షోరూంను వారు ప్రారంభించి మాట్లాడారు.తెలుగు రాష్ట్రాలలో నూతన కలెక్షన్స్, వివిధ వెరైటీలతో మెన్స్ అండ్ కిడ్స్ వేర్ లో మినిస్టర్ వైట్ పరంపర ప్రత్యేక గుర్తింపును పొందిందన్నారు.మినిస్టర్ వైట్ వారు తమ స్టోర్ ను సూర్యాపేటలో ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. వినియోగదారుల ఆదరణతో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం మినిస్టర్ వైట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సురేష్ రామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తమకు 62 స్టోర్లు ఉన్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 8వ షోరూంను సూర్యాపేటలో ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. లేటెస్ట్ డిజైన్స్, ట్రెడిషనల్, ఫంక్షన్ వేర్స్ తమ ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ.అంజద్ అలి, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, సంద్రపాటి విజయ్ కుమార్, కొనతం రాజేష్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, గండూరి శంకర్, నాయకులు ఫారూఖ్, రాచకొండ శ్రీనివాస్, కంపెనీ తెలంగాణ,ఏపీ రీజినల్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, ఈబీఓ మేనేజర్లు దినేష్, శర్వానాన్, మగేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టైమ్ పాఠశాల వార్షికోత్సవం

○ చిన్నారులకు పట్టాభిషేక వేడుకలు



**హాలియా, మార్చి 15 జనంసాక్షి:** హాలియా పట్టణంలోని సాయి ప్రతాప్ నగర్‌లో ఉన్న టైమ్ పాఠశాలలో వార్షికోత్సవం, చిన్నారుల పట్టాభిషేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. టైమ్ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి సంస్కారాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న విద్యాసంస్థగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా హాలియా మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి, అనుముల మండల విద్యాధికారి ముచెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, హాలియా మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హాలియా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ రెడ్డి, ఐదవ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి కరుణసాగర్, తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణాధికారి మందా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందుండేలా పాఠశాల ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమం ముగింపులో చదువు పూర్తిచేసిన చిన్నారులకు ప్రతీకాత్మకంగా పట్టాభిషేక వస్త్రాలు ధరింపజేసి ధ్రువ పత్రాలు అందజేశారు. వారి భవిష్యత్తు విద్యాభ్యాసం విజయవంతంగా సాగాలని అతిథులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మధిర లో ఘనంగా మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు

**మధిర, మార్చి 15 (జనంసాక్షి):** ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు, బీ.ఆర్.యస్ పార్టీ మాజీ లోక్ సభాపక్ష నేత నామ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను మధిర లో బీ.ఆర్.యస్ పార్టీ ఆద్వర్యం లో ఘనంగా నిర్వహంచారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ పట్టణ, రూరల్ కమిటీ నాయకులు మధిర మెయిన్ రోడ్ నందు ఉన్న వినాయకుడి గుడిలో నామ నాగేశ్వరరావు పేరున ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమా ల్లో మధిర పట్టణ పార్టీ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, మాజీ సహకార సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ ప్రసాద్, మధిర మున్సిపాలిటీ 19వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ వెంకట అప్పారావు, మండల పార్టీ కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, మధిర శివాలయం మాజీ అధ్యక్షులు నాగేశ్వర రావు, నాయకులు కొటారు రాఘవరావు, మాధవి, వీరారెడ్డి, ముత్తవరపు ప్యారి, ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, అబ్దుల్ ఖురేషి, పెద్దపూడి సుధాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య**

**రామన్నపేట, మార్చి 15 (జనంసాక్షి):**
రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలుగా మార్చి బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో జరిగే నిరవదిక నిరాహార దీక్షలో మండల పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. సోమవారం నుండి నిర్వహించే నిరవధిక నిరాహార దీక్షల స్థలాన్ని మండల నాయకులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతంలో అనేకమంది పేదలకు వైద్యం అందించిన ప్రభుత్వ ఆసుపత్రి నేడు దుర్భర పరిస్థితిలో కనీస సౌకర్యాలు లేకుండా వెలవెలబోతుందని పాలకుల చిన్నచూపుకు నిలువెత్తు నిదర్శనంగా దర్శనమిస్తోందని అన్నారు.వైద్యం సక్రమంగా అందక అనేక మంది దూరప్రాంతాలకు పోయి వైద్యం చేయించుకొని ఆర్థిక భారం మోయాల్సి వస్తుందని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు పోతున్నవని బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాసుపత్రికి నిధులు కేటాయించి నూతన భవన నిర్మించాలని, నిర్వహించబోయే నిరవధిక నిరాహార దీక్షలో అన్ని వర్గాల ప్రజలు రాజకీయాల కతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహ చారి,బోయిని ఆనంద్,కందుల హనుమంతు, గొరిగెసోములు,గాదె నరేందర్,నాగటి ఉపేందర్, వేముల సైదులు, మునికుంట్ల లెనిన్, శానగొండ రాము,కూనూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి వస్తువు కొనుగోలు కు రసీదు తీసుకోండి

**మధిర, మార్చి 15 (జనంసాక్షి):**
వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు (కెవిఆర్)కె ఆంజయ్య లు తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ వినియోగదారులు దినోత్సవం సందర్భంగా త వారు మాట్లాడుతూ కాలం చెల్లిన వస్తువులు అమ్మిన వారిపై, అలాగే కూల్ డ్రింకులు, ఐస్ క్రీములు తదితర సంబంధిత వస్తువులు ఎమ్మార్పీ ధరలు కంటే అధికంగా విక్రయించినా వారి మీద కంప్లీట్ చేయవచ్చు అన్నారు. వారికి జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉందన్నారు. కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటే రసీదు ఉండాలన్నారు. నష్టపోయిన వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల వినియోగదారుల ఫోరంను ఆశ్రయిస్తే తగిన న్యాయం జరుగుతుందన్నారు. ఆన్లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# పెంట్లం మల్టీ పర్పస్ వర్కర్లకు పిపిఈ కిట్స్ పంపిణీ

**అన్నపురెడ్డిపల్లి మార్చి 15 (జనంసాక్షి)**
గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు పెంట్లం గ్రామంలో సర్పంచ్ కారం శివ, ఉప సర్పంచ్ తేజవత్ వస్రాం ఆధ్వర్యంలో పిపిఈ కిట్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని వర్కర్లకు అవసరమైన పనిముట్లు,భద్రతా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కారం శివ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో మల్టీ పర్పస్ వర్కర్లు ఎంతో ముఖ్యమైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఎండా,



వానా తేడా లేకుండా గ్రామంలోని చెత్త తొలగింపు, కాలువల శుభ్రపరిచే పనులు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ,మల్టీ పర్పస్ వర్కర్లు,వార్డు సభ్యులు,ఆశ వర్కర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

- సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వై విక్రమ్
- సిపిఐ(ఎం) హవేలి కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ



**ఖమ్మం, (జనంసాక్షి) :**
ముస్లింలు అత్యంత పవిత్రంగా, అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ రంజాన్ అని, అలాంటి రంజాన్ పండుగ మత సామరస్యాన్ని పెంపొందించే విధంగా జరుపుకోవటం ఆనవాయితీ అని, ప్రత్యేకించి ఖమ్మంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ అనే భేదాలు లేకుండా అన్ని పండుగలను ప్రజలందరూ ఐకమత్యతో జరుపుకుంటారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వైవిక్రం అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రత్యేకించి వామపక్ష పార్టీలు మరియు లౌకిక పార్టీలు బలంగా ఉండటం వల్ల ఈ మతసామరస్యం సాధ్యపడుతుందని, ఇక్కడ మతోన్మాదులకు స్థానం ఉండదని ఆయన అన్నారు. మతం పేరుతో ప్రజలను విభజించి అల్లర్లు సృష్టించే కొద్ది మంది మతోన్మాదులుకి ఇక్కడ స్థానం ఉండదని అన్నారు. ఈ సందర్భంగా 200 కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆవాజ్ జిల్లా నాయకులు ఎంఏ జబ్బర్, ఎస్ కే మీరా సాహెబ్, దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, ఎస్కే నాగుల్ మీరా, గాలి వెంకటాద్రి, జట్ల ఆనందరావు, దంతాల నరసింహారావు, గొర్రెముచ్చు నాగేశ్వర రావు, కుర్రి వెంకటస్వామి, తాళ్లపూడి మంగమ్మ, వేదగిరి మురహరి, మాచర్ల గోపాల్, చిలకల వెంకటేశ్వర్లు, ఎస్కే జాఫర్ మియా, పిన్నింటి శ్రీనివాసరావు, చిలకల సునీత, ఎండి మునీర్, ఎండి అన్వర్, ఎండి తాహెర్, ఖలీల్, ఇబ్రహీం, ఎస్.కె నాగుల్ మీరా, ఇంటి మాధవి, ఎస్కే చాందిని, ఎస్కే షాహిన్, గొర్రె ముచ్చు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం–కురవి బ్రిడ్జి నిర్మాణం ఇంకెప్పుడో

- సీపీఎం మండల నాయకులు పొన్నం వెంకట రమణ
- బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

**ఖమ్మం రూరల్, మార్చి 15 (జనంసాక్షి)**
2024లో వచ్చిన వరద విపత్తుకు ఖమ్మం–కురవి జాతీయ రహదారిపై కాచిరాజు గూడెం–ములకలపల్లి గ్రామాల మధ్యలో ఉన్న బ్రిడ్జి కూలిపోయి ఏడాదిన్నర అవుతున్న ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మించక పోవడం సిగ్గు చేటని సీపీఎం ఖమ్మం రూరల్ మండల నాయకులు పొన్నం వెంకటరమణ అన్నారు. ఖమ్మం– మహబూబాద్ జిల్లాలను కలిపే బ్రిడ్జి లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ...జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో బ్రిడ్జి పక్కనే ఉన్న పాత చప్టా పైనుంచి తాత్కాలికంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్ళుతున్నాయన్నారు. బస్సులు,భారీ వాహనాలు రాకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యం వేల మంది ప్రయాణించే రహదారిపై బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా సరిహద్దు ల్లో బ్రిడ్జి కూలితే ఇప్పటివరకు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మంత్రులు వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందో ళనలు, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం భాస్కరరావు, పొన్నం మురళి,చాంద్ పాషా, యల్ది పరశురాం,కారుమంచి చలమయ్య, గూడూరు రాజేష్,అద్దంకి ఉపేందర్, పయ్యావుల వెంకటప్పయ్య, ధరావత్ నరేష్, వెంకన్న, అశోక్,మాలోత్ వీరన్న,నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

